# ఉపదేశం

శ్రీదేవి ముస్తాబు పూర్తయింది. ఆమె మేనత్త కోసం ఆత్రుతగా ఎదురుచూస్తోంది. ప్రొద్దున్న ఆమె చెవిలో చెప్పింది. "నీకో రహస్యం చెప్పాలి" అని. అదేమిటా అని శ్రీదేవి మనసు తహతహలాడిపోతోంది. రాత్రి పెళ్ళి తతంగం పూర్తయేసరికి రెండున్నర యింది. కళ్ళు మంటలుగా వున్నాయి. అయినా మనసంతా ఏదో తెలియని తత్తరపాటు, ఆనందం, ఉద్వేగం, మళ్ళీ అంతలోనే భయం.

తొలిరేయి అనేదానికి భార్యాభర్తలు ఎంతో ప్రాముఖ్యానిస్తారు. జీవితంలో మొదటిసారి పొందే మధురానుభూతి, జీవితాంతం అమూల్యంగా నిలిచిపోయే స్నేహబంధం.

శ్రీదేవికి నిముషమొక యుగంగానూ వుంది, గడుస్తున్న నిముషం భయపెడుతూనూ వుంది. ఏమైనా అత్తయ్య ఏదో మాట చెప్తానంది అదేమిటో తెలుసుకోవాలి.

శ్రీదేవి రూపంలోనూ గుణంలోనూ మేనత్త మాణిక్యంలా వుంటుంది. అందమైన రూపమైనా విపరీతమైన గడుసుతనం, జాణతనం ఆమె సొత్తు. అందుకే ఆ మేనగోడలంటే మాణిక్యానికి కూడా ఎనలేని ప్రేమ, యిష్టం. ఇద్దరి ఆలోచనా ధోరణి ఒకే మాదిరిగా వుంటుంది. నిజానికి శ్రీదేవికి తల్లి మెతకతనం, మొహమాటం ఏమాత్రం నచ్చవు. చిరాకు పడుతూ వుంటుంది తల్లిమీద తరుచూ-

శ్రీదేవి పూలజడ ముందుకు వేసుకుని రాళ్ళ చేమంతిపువ్వు గట్టిగా బిగించుకుంది.

ఇంతలో సరస్వతి గదిలో అడుగు పెడుతూనే "అమ్మా! శ్రీలూ కాఫీ తాగావుటే అసలే తలనొప్పి వస్తుందేమో" అంటూ కూతురు దగ్గర చేరి ఒకసారి ముంగురులు సవరించి నెమ్మదిగా-

"అంతా కన్నుమూసి తెరిచేలోగా అయిపోయింది. పెళ్ళి పెళ్ళని అనుకున్నంతసేపు పట్టలేదు. జాగ్రత్తగా మసలుకోమ్మా. అత్తారింట్లో వాళ్ళెలా చెబితే అలా విను. ఇక్కడన్నిటికీ ఎగిరినట్లు ఎగరకూడదు" అంది.

శ్రీదేవి విసుగ్గా తల్లివంక చూసింది. అమ్మ ఎప్పుడూ అంతే. ఎవర్తో చెప్పినట్లు వినమంటుందిగానీ, తను చెప్పినట్లు ఎదుటివాళ్ళు వినాలి అనుకోదు.

"అత్తయ్యెక్కడి కెళ్ళిందమ్మా" అంది. సరస్వతి ముఖం చిన్నబోయింది. తన మాటకి విలువ యివ్వదు కూతురు. పైగా తనుండగా అత్తయ్యగురించి అడుగుతోంది. నిజంగా ఈ పిల్ల మాత్రం ఆడబడుచు నోట్లోంచి ఊడిపడింది అనుకుంది. అయినా కొత్తగా పెళ్ళయి అత్తారింటి కెళ్ళబోతున్న పిల్ల మనసు కష్టపెట్టకూడదని తనే సర్దుకుని,

"ఇంకా నిద్ర లేచిందో లేదో" అంది నెమ్మదిగా. వీరి మాటల్లోనే మాణిక్యం వురకలు పరుగులతో వచ్చేసి ది.

"పాడు నిద్ర. వాళ్ళే తెలీలేదు. ఎంతసేపు పడుకున్నానో! పగటి నిద్రకితోడు కలలు కూడానూ. అవునూ అంతా తయారుచేసినట్లున్నారు. బాగున్నావే శ్రీ. నిన్ను చూసి అబ్బాయి మూర్ఛపోవడం ఖాయం" అంది గలగలా. శ్రీదేవి సిగ్గుగా అందంగా నవ్వింది. ఆడబిడ్డ మాటల ధోరణి తెలిసివున్న సరస్వతి సన్నగా నవ్వింది.

"నేను పెళ్ళి కాఫీ కలిపి తెస్తాను" అంటూ సరస్వతి కదిలింది. శ్రీదేవి వెంటనే "అత్తా! ఏదో చెప్తానన్నావు"అంది. మాణిక్యం ప్రేమగా బుగ్గలు చిదిమి "చెప్తానుగా" అంటూ నెమ్మదిగా శ్రీదేవి చెవిలో చెప్పడం మొదలుపెట్టింది. నాగస్వరానికి తల వూపే పాములా ఆమె మేనత్త

మాటలు శ్రద్ధగా వింది. ఒక్కొక్క మాట వింటున్నప్పుడు ఆమె కళ్ళల్లో ఒక్కొక్క వింతకాంతి వచ్చి చేరుతోంది. ఆశ్చర్యంతో అప్పుడప్పుడామె కళ్ళు మరీ విశాలమయ్యాయి.

*

పద్మనాభం పడకుర్చీలో కూర్చున్నాడు. బయట బ్రహ్మాండమైన ముసురు పట్టి వర్షం కురుస్తోంది. అయినా అతని మనసు తేలికగా, మబ్బులు విడిన ఆకాశంలా వుంది. అతని మనసు సంతృప్తితో సంతోషంగా వుంది.

నిజానికి పద్మనాభం యిప్పట్లో పెళ్ళి చేసుకోవాలనుకోలేదు. అతనికి ఇద్దరు చెల్లెళ్ళు వున్నారు, తల్లి వుంది. వారిద్దరికీ పెళ్ళిళ్ళు చేసి అత్తారిళ్ళకు పంపాలి అప్పుడుగానీ తన పెళ్ళికి తొందర లేదని అతను ఎంత మొత్తుకున్నా తల్లి వినలేదు. శ్రీదేవిని చూసిన క్షణం నుండి తనని సాధించి చంపుకుతినేసింది. సరే అనే వరకు వదలలేదు.

"నువ్వూ చిన్నవాడివే. పెళ్ళంటూ చేసుకుంటే నీ అత్తారి బలం వుంటుంది. నీ మామగారూ, బావమరుదులు నీకు సంబంధాలు వెదకడంలో సాయం చేస్తారు. లేకపోతే నేనా ఆడదానిని. నీకు అండగా నిల్చేవారెవరు?"

"చకచకా నాలుగు వూళ్ళూ తిరిగి సంబంధాలు చూస్తే శారదకీ, రమణకీ ఏడాదిలో పెళ్ళి చేసేద్దాం" అంటూ మెడలు వొంచి పెళ్ళికి వొప్పించింది తల్లి. అతనికి తల్లంటే ఎంతో ప్రేమ. చిన్నప్పుడే తండ్రి పోయినా రెండో కంటివాడికి తెలీకుండా పిల్లల్ని పెంచి చదువు సంధ్యలు చెప్పించింది. అమ్మని సుఖపెట్టాలి అనేది పద్మనాభం తీవ్ర వాంఛ.

పద్మనాభం ఏ వ్యసనాలూ లేని అరుదైన, అపురూపమైన పెళ్ళికొడుకు. అతన్ని తెలిసినవాళ్ళంతా శ్రీదేవి అదృష్టవంతురాలని పదేపదే అనుకున్నారు.

పద్మనాభం అప్పటికి పదోసారి అనుకున్నాడు "శ్రీదేవిలాంటి భార్య దొరకడం నిజంగా నా అదృష్టం" అని.

*

శ్రీదేవి తలొంచుకుని నెమ్మదిగా అంది.

"మిమ్మల్నేమీ కోరనుగానీ ఒక్కటి మాత్రం వినండి. మీ చెల్లెళ్ళు నాకూ చెల్లెళ్ళు. మీ అమ్మగారు నాకూ అమ్మ. వాళ్ళకి అన్నీ చూడటం, మీ అమ్మగారికి సేవ చేయడం నాకెంతో యిష్టం, తృప్తి. వాళ్ళు మననుంచి దూరంగా వెళ్ళిపోయే ఊహమాత్రం రానివ్వకండి" అంది.

పద్మనాభం ఆమెని ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు. అతనిలోని ఆశ్చర్యానికి అంతేలేదు. ఇది కలా, నిజమా అనే సందేహంలో పడిపో యాడు. అసలు ఎవరి జీవితంలోనైనా యిలాంటి వ్యక్తి తారసపడు తుందా? ఎంత గొప్ప మనసు? ఎంత ఔదార్యం? పరుల క్షేమం తప్ప మరొకటి కోరని మహాసాధ్వి. ఉత్తమురాలు. అత్తగారు ఆడబడుచులంటే ఆదిలోనే పరమ శత్రువులుగా చిత్రించుకునే మన సంఘంలో శ్రీదేవి లాంటి వాళ్ళు ఎంత అరుదు? ఆమె తనకి భార్యగా లభించటం ఎంతో అదృష్టం.

"ఏమిటి మీలో మీరే తన్మయంగా ఆలోచించుకుంటున్నారు, నాకూ చెప్పండి" అంది కాస్త గారంగా, మరికాస్త మురిపెంగా.

"ఆలోచనలేమీ లేవు. అంతా ఆశ్చర్యమే."

"ఎందుకు?"

"నీలాంటి వివేకవతి నాకు భార్యయినందుకు"

"చాల్లెండి పొగడ్తలు" అంది వయ్యారంగా.

*

గ్లాసుడు పాలు తీసుకెళ్ళి చటుక్కున అవతల పారబోసివచ్చింది శ్రీదేవి. తీరా అత్తగారు రత్తాయమ్మ చూడనే చూసింది. ఆశ్చర్య పోవడంతో బాటు ఆమె మనసు విలవిల్లాడి పోయింది. ఆమె తనకెందుకులే అని ఊరుకోలేదు.

"అదేమిటమ్మాయ్! పాలు పారబోశావ్" అంది. శ్రీదేవి గతుక్కుమంది.

"రాత్రి తాగాలని పెట్టుకున్నవి మర్చిపోయా, చేదెక్కిపోయాయి" అంది తలెగరేస్తూ.

"అయ్యో! గుర్తుంచుకు తాగితే ఫలంపాటుగానీ పారబోసుకుంటే ఏం వస్తుందీ?" అంది. అనడం నెమ్మదిగా అన్నా బాధ స్పష్టంగా ధ్వనించిందా మాటల్లో.

"ఆ మాత్రం నాకూ తెలుసు" అంటూ శ్రీదేవి అక్కడ్నించి వెళ్ళిపోయింది.

రత్తాయమ్మ దిగులుగా కూర్చుంది. ఇరవై ఏళ్ళుగా భర్త లేకపోయినా ఆడా మగా తనే అయి కాపురం చేసుకుంటూ వస్తోంది. వచ్చిన డబ్బుతో నాలుగూ అమర్చిందేగానీ ఏగాణీ అప్పు పెట్టలేదు. కొత్తగా కోడలొచ్చిందని సంబరంగా అనుకునేంతలో ఇంటి ఖర్చు తారాపథాని కందుకుంది. శేరున్నర పాలవాడిక రెండుశేర్లన్నరకి పెరిగింది. అదే మంటే "మనిషికి అర్ధశేరు లెక్కకదా" అంది శ్రీదేవి ఆరోగ్య సూత్రం వల్లిస్తూ. రత్తాయమ్మకి నోట మాట రాలేదు.

"మన కంత విరివిగా కొనేందుకు వీలులేదు" అని ఎలా చెప్పాలో ఆమెకి తెలీలేదు. తీరా చూస్తే తాగేదానికంటే వృథా చేసే దెక్కువై పోయింది.

పప్పు వెయ్యడం దగ్గరనుంచీ, పసుపు రాసుకోవడం వరకు శ్రీదేవి వృథా చెయ్యడం రత్తాయమ్మకి ఎక్కడలేని ఆవేదననీ కలిగి

స్తోంది. ఏం చెయ్యాలో, ఎలా చెప్పాలో తెలీక మధనపడటం మొదలు పెట్టింది. ఏమైనా గట్టిగా అంటే కొడుక్కి కోడలిమీద కొండేలు చెప్పి నట్లుంటుంది. చిటికెడు పసుపు రాసుకోవాలంటే చారెడు పట్టుకుపోయి రాచుకుంది వాడి, మిగిలింది నీళ్ళగదిలో వదిలేసేది. చూసిచూసి రత్తా యమ్మ ఒక రోజు సణుక్కుంది. పద్మనాభం విన్నాడు ఏమిటని భార్య నడిగాడు.

"ఏముంది ? పసుపు రోజూ రాసుకోవాలా ఎందుకూ వేస్తూ అంటా రామె. నాకు చిన్నప్పటినుంచి అలవాటు పసుపు రాసుకోవడం. మానాన్న నాకోసం పసుపు కొమ్ములు తెప్పించి ఆరువీశల పసుపు ఏడాదికి కొట్టించే వారు. మా యింటో పసుపుకుంకాలు దండిగా వుండాలి. పోనీలెండి, ఆమె పెద్దవారు అంటే మాత్రం ఏం పోయింది" అంటూ పనిలోకెళ్ళి పోయింది. పద్మనాభం మనసు కరిగిపోయింది. ఇదే మరో యింటో అయితే ఎంత గొడవేనా జరిగేది. శ్రీదేవి పరమసాధ్వి కనుక సరిపో యింది అనుకున్నాడు. మర్నాడు రత్తాయమ్మ నేరుగానే చెప్పింది.

"మీరు నాకేం చెప్పనవసరంలేదు. ఇలాంటి విషయాల్లో కక్కుర్తి పడటం మాయింటా వంటా లేదు" అంది విసురుగా.

పదార్థాలు ఎక్కువగా వండేసి పనిమనిషికి కూడా యివ్వక దాచి, మర్నాడు గోడవతల విసిరికొట్టడం శ్రీదేవికి అలవాటు. పోనీ ఒకరోజు అలా జరిగిందని మరోరోజు జాగ్రత్త పడదు. అసలు ఎవరేనా ఏదైనా చెబితే వినదు. పైకి మాత్రం నమ్రత నటిస్తుంది.

నెల్లాళ్ళకని తెచ్చిన సరుకులు ఇరవై రోజులకే అయిపోయాయి. రత్తాయమ్మ ఎటూ చెప్పలేక నెమ్మదిగా అంది.

"పొదుపుగా చేసుకోవాలి వంటలు. సరుకుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయ్" అంది. వెంటనే పద్మనాభం అందుకున్నాడు-

"తనకి భారీగా చెయ్యడం అలవాటు. వాళ్ళింట్లో చిన్నప్పటినుంచీ నలుగుతూ వచ్చేపోయే అలవాటు. అందుకని అందరికీ అన్నీ పుష్కలంగా

వుండాలని తాపత్రయపడుతుంది. అందరం కమ్మగా తింటూనే వున్నాంగా. వేస్టేం చెయ్యడం లేదుకదా" అంటూ తేల్చాడు.

రత్తాయమ్మతోబాటు అతని చెల్లెళ్ళు శారద, రమణీ కూడా ఆశ్చర్య పోయారు. ఆ క్షణంలో శ్రీదేవి ముఖంలో ఆమె గెలుపు తాలూకు గర్వపురేఖ తొణికిసలాడటం అందర్నీ చకితుల్ని చేసింది.

"రమణికి, శారదకి మంచి సంబంధాలు చూడండి. ఇదిగో, కాస్త కట్నమెక్కువైనా సరే. కక్కుర్తిపడి హోదా తగ్గేపని చెయ్యకండి. ఎక్కడైనా డబ్బు తేలేకపోము. అంతగా కావాలంటే నా నగలు బ్యాంక్‌లో పెట్టి అప్పు తెద్దాం" అంది శ్రీదేవి ఆవేశంగా.

పద్మనాభం ఆరాధనగా భార్యవంక చూస్తుండిపోయాడు. ఆమె యింత త్యాగశీలతతో మాట్లాడుతుంటే తన తల్లీచెల్లెళ్ళూ సరిగ్గా ప్రతిస్పందించటం లేదనిపించిందతనికి. శ్రీదేవిలోని ఉత్తమ సంస్కారం అత్తగార్ని తల్లిగా భావించినా, సనాతనవంతురాలైన తన తల్లి మాత్రం శ్రీదేవిని కోడలుగానే చూస్తోంది అనిపించిందతనికి.

*

ఆరోజు నిద్ర లేస్తూనే గుమ్మంలో రిక్షా ఆగడం చూసి అందులోంచి దిగుతున్న కామాక్షిని చూసి ఆనందంతో పరుగెట్టుకెళ్ళి లోపల కాహ్వానించింది శ్రీదేవి.

కామాక్షి శ్రీదేవికి పిన్నికూతురు. పెళ్ళికి రాలేదని యిప్పుడు తిరుపతి వెళ్తూ చూసి పోదామని మధ్యలో దిగింది. ఇంక శ్రీదేవి హడావిడికి హద్దే లేకుండా పోయింది. బూర్లు, పులిహోర, రెండుకూరలు, పప్పు, పులుసు, రెండు పచ్చళ్ళు చేసింది.

"ఎందుకే యింత హైరానా" అంటూ కామాక్షి సాగదీసింది. "నువ్వు నా పెళ్ళికి రాలేదుగా. అందుకని అవన్నీ యిప్పుడు చేస్తున్నా" అంది ఖుషీగా.

శారద, రమణి స్కూళ్ళకు వెళ్ళిపోయారు. రత్తాయమ్మ వంట దగ్గర కూర్చుంది. ఎంతెంత చెయ్యాలో శ్రీదేవి చెప్పింది. రత్తాయమ్మ మెత్తగా అంది-

"నీకెందు కమ్మాయి? నేనన్నీ కమ్మగా చేసి వడ్డిస్తానుగా నువ్వా మెతో కబుర్లు చెప్పుకుంటూ కూర్చో" అంది. ఇంతలో పద్మనాభం ఎలా గ్రహించాడో "అమ్మా! అది చెప్పినట్టు చెయ్యి దానికన్నీ బాగా తెలుసు" అన్నాడు. రత్తాయమ్మ మరిక మాట్లాడలేదు. అవమానంగా అనిపించిందామెకి. ఆమె కన్నీ తెలుసని తన కొడుకు నమ్మకం. ఇన్నేళ్ళ జీవితంలో తను ఎందరొస్తే ఎలా చెయ్యాలో తెలీకుండానే వుందా అని పొరుషపడి వూరుకుండిపోయింది. ఊహించినట్లుగా భోజనా లయ్యేసరికి పదార్థాలు చాలా మిగిలిపోయాయి. రత్తాయమ్మ వూరుకో లేదు. "అమ్మాయీ! నువ్వు చెబితే వినవు చూడు ఇంత పదార్థం మిగిలితే ఏం చేసుకుంటాము" అంది నిష్ఠూరంగా.

"ఇంకా శారదా, రమణీ భోజనం చెయ్యలేదుగా" అంది.

"ఇద్దరు పిల్లలు తింపేమాత్రం ఇంత తింటారా" అంది రత్తాయమ్మ వళ్ళమంటగా.

"ఏమోబాబు, మావాళ్ళు వస్తే మీకింత కంట్రకింపుగా వుంటుందని తెలీదు. తెలిస్తే గుమ్మంలోంచే పంపేద్దును" అంటూ దుసరుస వెళ్ళిపో యింది. రత్తాయమ్మ నిర్ఘాంతపోయింది.

మధ్యాహ్నం మూడు గంటలకి భార్యాభర్తలు బజారుకెళ్ళి కామాక్షి కోసం చీర కొని పట్టుకొచ్చారు.

"అత్తయ్యా! ఇదిగో మా కామాక్షికి పెట్టడానికి చీర తెచ్చాం" అంటూ చూపించింది.

"చాలా బాగుందమ్మా ఎంతేమిటి?" అంది రత్తాయమ్మ.

"రెండు వందల యాభై" గర్వంగా చెప్పింది శ్రీదేవి. రత్తాయమ్మ మరేం మాట్లాడలేదుగానీ ఆమె ముఖంలో మారిన రంగులు చూసి, నిర్లక్ష్యంగా ఓ నవ్వు విసిరి వెళ్ళిపోయింది శ్రీదేవి.

మధ్యదారిలో చంటిపిల్ల ఏడుస్తుందేమోనని, కామాక్షి వద్దంటున్నా వినకుండా హార్లిక్సు సీసా కామాక్షి బుట్టలో సర్దేసింది. శ్రీదేవిలో వున్న బడాయికీ, డాబుసరికి శారద, రమణి చిరాకుపడినా పెదవి విప్పలేము.

మర్నాడు పద్మనాభం ఆఫీసు కెళ్ళిపోయాక రత్తాయమ్మ కోడల్ని నిలేసింది. "అవునూ, నీ తోడబుట్టిన చెల్లెలు కాదు కదా! ఏమిటా పెట్టుపోతలు. ఇలా వందలు వందలు చీరలు పెడితే మూడోనాటికి సంసారం ఒక కొలిక్కి వస్తుంది. రెండు వందల యాభై రూపాయలు చీర పెడితేనే ప్రేమ వున్నట్లా. అరవై, డెభ్భైలలో చక్కటి చీర లొస్తున్నాయి. అలాంటి దొకటి పెడితే పరువుగానూ వుంటుంది, మనకి బరువుగా వుండదు" అంది.

అత్తగారి మాట పూర్తయేలోపులోనే శ్రీదేవి కందగడ్డలా ముఖం చేసుకుని "ఇదిగో చూడండీ. మీకు యాభైరూపాయలు చాలు అనిపిస్తే నాకు రెండువందలుగానీ చాలదనిపిస్తుంది. మా యింటి ఆచారమది. మా యింటికి ఎవరైనా భోజనానికి వచ్చినా బొట్టుపెట్టి చీర పెట్టడం ఆనవాయితీ. మా కిలా పైసా పైసాకి చూసుకోవడం యింటా వంటా లేదు. నాకు సొంత చెల్లెలు కాదన్నారు. ఏదైనా 'అనుకోవడం'లో వుంటుంది. మీకు రమణి, శారద, ఎంతో నాకు కామాక్షి అంత, తెలిసిందా? అయినా నా మొగుడు కష్టపడి సంపాదించింది నేను ఖర్చుపెడుతున్నాను మీ కెందుకు బాధ? ఇంకెప్పుడూ నా విషయాలు నా ఖర్చులు అడగకండి. మీకేదైనా కావాలంటే అడగండి ఎంత ఖరీదైనా కొనిపారేస్తాను" అంటూ విసురుగా చెప్పి తన గదిలో కెళ్ళిపోయింది.

శ్రీదేవి మాటలకు రత్తాయమ్మ తల్లడిలిపోయింది. తను చెప్పిన దానిలో తప్పేముందో ఆమె కర్థంకాలేదు. జాగ్రత్తగా, పొదుపుగా వుండమని చెప్పడం యింత తప్పా అని విలవిల్లాడిపోయింది. కన్నకొడుకు దగ్గర తన బాధ చెప్పుకునే అవకాశం కూడా లేదే అని మరీ బాధపడి పోయింది. పెళ్ళి వద్దుగాక వద్దన్నవాడికి యిప్పుడు పెళ్ళామెలా బెల్లమై పోయిందా అని ఆశ్చర్యపోయింది. ఆవేదనపడిపోయింది. శారదా, రమణి తల్లినే మందలించారు.

"వాళ్ళ యిష్టం. అన్నయ్యకి నచ్చినప్పుడు మధ్యలో నీ కెందుకు ?" అన్నారు. ఆరోజు యింటికొస్తూనే పద్మనాభం వాతావరణం పసికట్టాడు. వెంటనే శ్రీదేవి నడిగాడు ఏమిటని. ఆమె కళనీళ్ళ పర్యంతమై చెప్పింది. "అంత ఖరీదు చీరెందుకు కొన్నావు ? నీ తాతగారి సొమ్ము దాచిపెట్టావా ! నువ్వు తెచ్చిన ఆస్తిపాస్తులు మిగిలిపోతాయని భయమా ? ఉన్నదంతా మీ వాళ్ళకి దోచిపెట్టేస్తే రేపు మేమంతా చిప్పా కర్ర పుచ్చుకోవాలి. ఆడపడుచుల ముఖాన కూడా ఇంత ఖరీదు చీరలు మీరు పెట్టారా" అంటూ గంటసేపు నన్ను నానా మాటలూ అని దులిపేశారు. నేను తట్టుకోలేక పోయాను. నేను ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అయినా నా అహం దెబ్బతింది అందుకే ఒకే ఒకమాట అన్నాను. "మా ఆయన సంపాదన నా యిష్టం" అని చెప్పడం పూర్తిచేసి శ్రీదేవి కళ్ళు తుడుచుకుంది. పద్మనాభం ఓ క్షణం నిశ్శబ్దంగా వుండిపోయాడు.

"అలా అనటం తప్పయితే క్షమించండి." అంది ముక్తాయింపుగా.

"అసలు అమ్మకి ఒకసారి గట్టిగా చెప్పాలి." అన్నాడు కోపంగా. వెంటనే అతని దగ్గరగా వెళ్ళి ఆ పని మాత్రం చెయ్యకండి. ఏదో పెద్దవారు. ఆవిడ నన్నంటే పోయిందేముంది ? నేనేం పట్టించుకోను. ఈ చెవితో విని మరో చెవితో వదిలేస్తాను" అంది.

" మంచిమాట చెప్పావు. నువ్వెంతో ఓర్పుగలదానివి కాబట్టి సరిపోతోందిగానీ, మరొకళ్ళయితే ఎంత గొడవ, అయినా మంచిమాట చెప్పావు. నీ మొగుడి సంపాదన నీ యిష్టం " అన్నాడు పద్మనాభం వత్తిపలుకుతూ.

" అన్నానేగానీ నాకెంతో బాధగా వుంది. అప్పట్నుంచీ ఏడుస్తూనే వున్నాను. ఆమె పెద్దవారు. మా అమ్మలాంటివారు " అంది. అతనామెని దగ్గిరికి తీసుకుని ఓదార్చాడు. ఇచ్చేవాళ్ళుంటే ఆమెకి నటనలో ఊర్వశి అవార్డు యివ్వొచ్చు.

*

రత్తాయమ్మ ఆనందానికి అవధుల్లేకుండా వున్నాయి. అనుకోకుండా శారదకి పెళ్ళి సంబంధం కుదరటమే కాకుండా, ఎంతో తక్కువ శ్రమతో రమణికి కూడా సంబంధం కుదిరింది. శారదకి కట్నం లేకుండా, రమణికి పదివేలు లాంఛనాల నిమిత్తం అడిగారు. ఇది కలా, నిజమా అని రత్తాయమ్మ కలవరపడిపోతూంది. శ్రీదేవి అవకాశం జారవిడుచుకోకుండా చెప్పుకుంది.

"చిన్నప్పటినుండి నా పాదం చాలా మంచిదని అందరూ అంటారు. అసలు మానాన్న ఏ పని చేసినా ముందు నా చేతే చేయించేవారు. ఓసారేం జరిగిందంటే, మాయింటి పెనకాల వసారాలో ఓ పెద్ద సిమెంట్ పొయ్యి కట్టించారు. అది ఎవరూ ప్రారంభించటానికి వీల్లేదని నా చేత వెలిగింప చేశారు మా నాన్న. అప్పట్నుంచి మా యింటికి ఎవరో ఒకరు వస్తూనే వుండేవారు. రోజుకి నలుగురైదుగురు అతిథులు. ఆ పొయ్యి ఎప్పుడూ వెలుగుతూనే వుండేది " అంటూ పెద్ద పెట్టున నవ్వుతూ చెప్పింది. ఆమెతో పద్మనాభం శ్రుతి కలిపాడు. మిగిలినవాళ్ళు ముఖాన నవ్వు పులుముకుని కూర్చున్నారు. రత్తాయమ్మ మాత్రం "మా తల్లే నీ పాదం మహిమ " అనుకుంది.

ఆ రాత్రి భర్తతో "ఏమండీ పెళ్ళి చాలా ఘనంగా చెయ్యాలి, వాళ్ళు కట్నాలు ఆశించటంలేదు. పెళ్ళి కూడా లోభత్వంగా, టూకీగా చేస్తే బాగుండదు. పైగా మనకేం లోటు ? రెండువేలు జీతం తెచ్చుకునే మీరు పదిమందికి భోజనం పెట్టలేరా" అంది. శ్రీదేవిలో వుత్సాహం చూస్తే పద్మనాభానికెంతో ముచ్చట.

"నీ యిష్టం శ్రీ. నీ మాట ఎవ్వరూ కాదనరు. అమ్మ ఏదైనా అన్నా నువ్వు పట్టించుకోకు. నీ చేతికి ఇరవై వేలు యిస్తాను నువ్వే చెయ్యి అన్నీ" అన్నాడు. అంతే శ్రీదేవి నెవ్వరూ పట్టలేకపోయారు. కొన్ని ఆంధ్ర సాంప్రదాయాలంది. కొన్ని కన్నడ ఆచారాలంది, ఇవన్నీ మన కెందుకు ? అంటే,

'అందంగా వున్నవన్నీ మనమూ చేసుకోవచ్చుగా. ఇవన్నీ ముచ్చట్లు' అంది.

'ఆడబడుచుల పెళ్ళికోసం యిలా తాపత్రయపడే మనిషి ఎక్కడా వుండదు.' అని అందరూ అనుకున్నా లేకున్నా పద్మనాభం మాత్రం పదే పదే అనుకున్నాడు.

"ఏదైనా వుంటే పిల్ల చేతిలో పెడితే వాళ్ళు సంసారంకి కావలసిన సామాను కొనుక్కుంటా"రని రత్తాయమ్మ చెప్పినా ఆమె మాట సాగలేదు.

పెళ్ళికి వారం ముందుగానే మాణిక్యం దిగింది. "ఎక్కువసేపు మా అత్తగారితో కబుర్లలో పడక, పొద్దున్న నుత్తి కొడతారు." అన్న మాటలు అనుకోకుండా విన్న శారద అవాక్కయిపోయింది. నోరు విప్పితే గొడవైపోతుంది. అందుకే బింగేసి వూరుకుంది.

పెళ్ళి ఘనంగా జరిగిపోయింది. ఊళ్ళో జనమంతా వళ్ళు పులిసిపోయేలా పొగిడారు. ఉన్న ఇరవై వేలూ కాక మరో పదివేలు పైన ఖర్చయింది. పద్మనాభం ముప్పైవేలు అప్పుతీర్చటానికి సంసిద్ధుడవుతూ అనుకున్నాడు.

" వాళ్ళు కట్నం అడగలేదు. అడిగితే యిచ్చేవాళ్ళమే కదా ! యిచ్చివుంటే యింకా ఎక్కువే అయ్యేది. ఇంతటితో తేలడం అదృష్టం. శ్రీదేవి నేర్పుతో చేసింది కాబట్టి చక్కగా జరిగింది " అనుకున్నాడు.

*

పద్మనాభం ఉస్సురంటూ కుర్చీలో కూర్చుండిపోయాడు. ఆఖరివాడికి మెడిసన్‌లో సీటు వచ్చింది. పదివేలు కట్టుకోవాలి. యాభై పైబడిన పద్మనాభం దగ్గర పైసా వెనకేసి లేదు. అతని కిప్పుడు కలతగా వుంది. శ్రీదేవి మామూలు పాటే పాడింది. " నా నగలు బ్యాంకులో పెట్టి వాడ్ని చేర్పించండి " అని.

"ఎప్పుడూ అప్పు చెయ్యడం వడ్డీతో సహా దాన్ని తీర్చుకోవడంతో సరిపోతోంది " అన్నాడు విసుగ్గా.

" ఉలేవారే ఏం చేస్తాం. మధ్యతరగతి వాళ్ళం " అంది.

" చాల్లే మనలాంటివాళ్ళే కాస్తా కూస్తో నిలవ లేకుండా లేరు " అన్నాడు బాధగా.

" చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు.... "

" ఏ నాటి మాట....ఊరుకో " అన్నాడు. అప్పుడు తల్లి మాటలు గుర్తుకొచ్చాయి. " వందరూపాయి లొచ్చిననాడు తొంభై ఖర్చు చేస్తే వాడెప్పుడూ ధనవంతుడే. నూటపది చేస్తే దరిద్రుడే " అని - ఎందుకో అది గుర్తుకొచ్చి చిరుక్కుమంది.

అత్తారింట్లో తన మాటే చెల్లాలి అనే పంతంతో భర్త దగ్గర అతని వాళ్ళమీద ప్రేమ కురిపించి, అతన్ని తనవైపు తిప్పుకుంది మేనత్త సలహాతో, ఏం లాభం ? తన యిల్లు సర్దుకోవడంలో పెద్దవాళ్ళ సంహా లేకుండా, రెండు ముఖాల నాటకమాడి శ్రీదేవి బోరగబెట్టుకున్నది కూడా ఏమీ లేదు. ఆమె అంత నటించకుండా వుంటే కనీసం పద్మనాభం ఆమెని సరైన మార్గంలో పెట్టేవాడేమో, కాని ఆమె అతన్నే బుట్టలో పెట్టేసింది.

శ్రీదేవికి, పొదుపుకి లోభత్వానికి భేదం యిప్పటికీ తెలీదు. ఇక ముందు తెలిసే అవకాశం కూడా లేదు. పద్మనాభానికి తెలిసినా చెయ్యగలిగిందీ లేదు.